క్లుప్తంగా

మల్లిపూడి ట్రస్టు ద్వారా పింఛన్ల పంపిణీ

కొవ్వూరు: నిరుపేదలకు మల్లిపూడి చారిటబుల్ ట్రస్టు సాయపడడం అభినందనీయమని ఆరికిరేవుల సొసైటీ మాజీ అధ్యక్షుడు పామెర్ల నగేష్ అన్నారు. ఆ ట్రస్టు సమకూర్చిన మెడికల్ పింఛన్లను ఎంపీటీసీ సభ్యుడు నడింపల్లి అప్పారావుతో కలసి చిడిపి గ్రామంలో బుధవారం ఆయన పంపిణీ చేశారు. ఒక్కొక్కరికి రూ.3,100 చొప్పున 10 మందికి పింఛన్లు అందజేశారు. అలాగే చిడిపి గ్రామానికి చెందిన దేవోక్తి సంస్థకు రూ.రెండు వేల ఆర్థిక సాయం అందజేశారు. ట్రస్టు ప్రతినిధి మల్లిపూడి ధనరాజు, కట్టా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హైస్కూల్లో 'నాడు- నేడు' పనుల పరిశీలన

తాళ్లపూడి: పెద్దేవం గ్రామంలోని జీఎస్ రావు జెడ్పీ హైస్కూల్లో జరుగుతున్న నాడు–నేడు పనుల పురోగతిని బుధవారం జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ, సర్పంచ్ తిగిరిపల్లి వెంకటరావు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు తోట రామకృష్ణ పరిశీలించారు. హెచ్‌ఎం సీహెచ్ నాగేంద్రరావుతో పనులు జరుగుతున్న తీరుపై వారు ఆరా తీశారు. త్వరితగతిన పనులను పూర్తి చేయాలని సూచించారు. వారి వెంట వైఎస్సార్ సీపీ మండల ప్రచార కమిటీ అధ్యక్షుడు నామ ప్రకాశం కూడా ఉన్నారు.

టెన్త్ నమూనా ప్రశ్న పత్రాల విడుదల

పెరవలి: ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) రూపొందించిన 10వ తరగతి నమూనా ప్రశ్నా పత్రాలను బుధవారం ఎంఈఓ షేక్ సూర్జన్ స్థానిక విద్యా వనరుల కేంద్రంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నమూనా ప్రశ్నాపత్రాలను అధ్యయనం చేస్తే పదో తరగతి విద్యార్థులకు పరీక్షల్లో మేలు జరుగుతుందన్నారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి వెంకటరమణ మాట్లాడుతూ టెన్త్ విద్యార్థుల సౌకర్యార్థం తెలుగు, ఇంగ్లిషు మీడియంలలో వీటిని రూపొందించామన్నారు. కార్యక్రమంలో వీవీఎస్ సత్యనారాయణ, కె. మహేశ్వరరావు, ఈ.గణపతి, ఎన్. వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

భీమోలు పట్టాదారులకు న్యాయం చేయాలి

గోపాలపురం: మండలం భీమోలు పట్టాదారులకు ప్రభుత్వం న్యాయం చేయాలని, సీబీసీఐడీ విచారణ జరిపి, నిజాలను నిగ్గు తేల్చాలని వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి కారుమంచి రమేష్ ప్రభుత్వాన్ని కోరారు. గోపాలపురం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న చేస్తున్న భీమోలు పట్టాదారులకు బుధవారం ఆయన సంఘీభావం తెలిపారు. భీమోలు భూముల వ్యవహారంలో కుమ్మక్కైన నాయకులను బయటకు తీసుకు వచ్చి పట్టాదారులకు న్యాయం చేయాలన్నారు. కాగా ఆందోళన చేస్తున్న పట్టాదారులు మూడో రోజైన బుధవారం అర్ధనగ్న ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో సాలి వేణు, కొడవటి బుజ్జిబాబు, కాకులపాటి వెంకట్రావు, ఆచంట సురేష్, కాకర్ల గంగరాజు పాల్గొన్నారు.

డిపోలో స్టాల్ నిర్వహణకు టెండర్ల ఆహ్వానం

నిడదవోలు: స్థానిక ఆర్టీసీ డిపోలో ఖాళీగా ఉన్న స్టాల్‌ను నెల వారీ అద్దె చెల్లించి నిర్వహించుకునేందుకు వ్యాపారుల నుండి సీల్డ్ టెండర్లను ఆహ్వానిస్తున్నట్టు ఆర్టీసీ డీఎం శ్రీరామ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అవసరమైన దరఖాస్తు ఫారాలు రూ.250 చొప్పున చెల్లించి డిపో కార్యాలయంలో తీసుకోవాలన్నారు. టెండర్లు దాఖలు చేసుకునేందుకు ఈనెల 22 వరకూ గడువు ఉందన్నారు. అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు టెండరుదారుల సమక్షంలో దరఖాస్తులను తీస్తామన్నారు. ఎంపికైన లైసెన్సుదారుడు లైసెన్సు ఫీజును జీఎస్టీతో చెల్లించాలన్నారు.

మాదక ద్రవ్యాలతో యువత భవిష్యత్తు చిత్తు

కొవ్వూరు: మాదక ద్రవ్యాలకు, చెడు వ్యసనాలకు యువత దూరంగా ఉండాలని ఎస్‌ఈబీ ఇన్‌స్పెక్టర్ వీటీవీ సత్యనారాయణ సూచించారు. మాదక ద్రవ్యాల వాడకం వల్ల కలిగే అనర్థాలపై బుధవారం పట్టణంలోని భాష్యం స్కూల్ విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మత్తు పదార్థాల వాడితే కలిగే అనర్థాల గురించి విద్యార్థులకు వివరించారు. మత్తు పదార్థాలకు బానిసలుగా మారితే ఆరోగ్యం దెబ్బతింటుందని హెచ్చరించారు. ప్రిన్సిపాల్ జి.వరలక్ష్మి, ఎస్‌ఈబీ సిబ్బంది, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఆశా వర్కర్ కుటుంబానికి ఆర్థిక సాయం

దేవరపల్లి: గతేడాది అనారోగ్యంతో మృతి చెందిన మండలంలోని కృష్ణంపాలేనికి చెందిన ఆశా వర్కర్ శీలబోయిన రమాదేవి కుటుంబానికి గోపాలపురం నియోజకవర్గ జనసేన కన్వీనర్ డి.సువర్ణరాజు బుధవారం రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నాయుడు దుర్గాప్రసాద్, పార్టీ దేవరపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు కంబాల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు. అలాగే కొవ్వూరు మండలం దొమ్మేరుకు చెందిన బాలుడు జొన్నకూటి అశోక్ కాళ్లు చచ్చుబడి రాజమహేంద్రవరంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాలుడి వైద్యం కోసం దేవరపల్లిలోని టి.ముకుంద స్వచ్ఛంద సేవాసంస్థ అధ్యక్షుడు తంగెళ్ల సుబ్రహ్మణ్యం, సంస్థ సభ్యులు రూ.10 వేల ఆర్థిక సాయం చేశారు.

ప్రారంభోత్సవానికి అర్బన్ హెల్త్ సెంటర్ ముస్తాబు

- వారం రోజుల్లో అందుబాటులోకి..
- అందుబాటులోకి అత్యాధునిక వైద్యం
- 21,618 మంది మెరుగైన సేవలు



నిడదవోలు నెహ్రూ నగర్ అర్బన్ హెల్త్ సెంటర్ నూతన భవనం

నిడదవోలు: పట్టణంలోని వైఎస్సార్ కాలనీలో రూ.91 లక్షల వ్యయంతో చేపట్టిన అర్బన్ హెల్త్ సెంటర్ భవన నిర్మాణం దాదాపు పూర్తయ్యింది. మరో వారం రోజుల్లో ఈ నూతన భవనాన్ని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు ప్రారంభిస్తారు. అన్ని వసతులతో కూడిన ఈ నెహ్రూనగర్ అర్బన్ హెల్త్ సెంటర్లో రోగులకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందనున్నాయి. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టాక పట్టణాల్లోని పేద, మధ్య తరగతి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే సంకల్పంతో రాష్ట్ర వ్యాప్తంగా 542 అర్బన్ హెల్త్ సెంటర్లను ప్రారంభించారు. ఇందులో భాగంగా పట్టణంలో 2021లో రెండో అర్బన్ హెల్త్ సెంటర్‌ను ప్రారంభించారు. అప్పటి నుంచి ఈ హెల్త్ సెంటర్ అద్దె భవనంలోనే నడుస్తోంది. స్థానిక ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడి ప్రత్యేక శ్రద్ధతో నూతన భవన నిర్మాణం పూర్తవుతోంది. నూతన భవనంలో విశాలమైన గదులు నిర్మించారు. ఒక ల్యాబొరేటరీ గది, రెండు ఓపీ గదులు, రెండు డ్రెస్సింగ్ రూములు, లేబర్ రూమ్, సమావేశ మందిరం, ఫార్మసీ గది, మైనర్ ఆపరేషన్ థియేటర్, మినీ వార్డు, మూడు ఇంటీరియర్ మరుగుదొడ్లు, సామూహిక మరుగుదొడ్లు నిర్మించారు. వైద్య సేవల కోసం అధునాతన పరికరాలను అందుబాటులో ఉంచుతున్నారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న జగనన్న కాలనీ, వైఎస్సార్‌నగర్, ఎంవీ నగర్, తీరగూడెం, లింగంపల్లి, నెహ్రూ నగర్ ప్రాంతాల ప్రజలకు ఈ అర్బన్ హెల్త్ సెంటర్ ద్వారా వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయి.

ఇప్పటికే మెరుగైన వైద్యం

ప్రస్తుతం అద్దె భవనంలో నడుస్తున్న నెహ్రూ నగర్‌లో అర్బన్ హెల్త్ సెంటర్‌లో కూడా పేదలకు మెరుగైన వైద్యమే అందుతోంది. ఈ సెంటర్‌లో ఒక వైద్యాధికారి, ఇద్దరు స్టాఫ్ నర్సులు, ఫార్మసిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్, డీఈవో, ఎల్‌జీఎస్, అటెండర్ విధులు నిర్వహిస్తున్నారు. ఈ అర్బన్ సెంటర్ పరిధిలో ప్రస్తుతం 21,618 మంది ప్రజలకు వైద్య సేవలు పొందుతున్నారు. దీని పరిధిలో ఆరు సచివాలయాలు, ఆరు అంగన్‌వాడీ కేంద్రాలు, ఏడుగురు ఆరోగ్య కార్యకర్తలు పనిచేస్తున్నాయి. ఇక్కడ 62 రకాల రక్త పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇందుకోసం హెమటాలజీ అనలైజర్, ఎలక్ట్రోలైట్స్ ఎనలైజర్, బయో కెమిస్ట్రీ ఎనలైజర్, మైక్రోస్కోప్, సెంట్రిఫ్యూజ్, యూరిన్ ఎనలైజర్, బ్లడ్ మిక్సర్ వంటి వైద్య పరికరాలు అందుబాటులో ఉన్నాయి. రోగుల పంపిణీకి 72 రకాల మందులు అందుబాటులో ఉన్నాయి. చిన్నారులకు వ్యాధి నివారణ టీకాలు సైతం వేస్తున్నారు. ప్రభుత్వం ఇటీవల జగనన్న ఆరోగ్య సురక్ష పేరుతో నెహ్రూ నగర్ అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలో సుమారు 1,000 మంది ప్రజలకు రక్త పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేసింది. ఈ హెల్త్ సెంటర్లో ప్రస్తుతం రోజుకు 40 నుంచి 50 వరకూ ఓపీ నమోదవుతోంది. నూతన భవనం ప్రారంభమైతే ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు.

> **కొద్ది రోజుల్లోనే కొత్త భవనంలోకి..**
>
> 
>
> ప్రస్తుతం అద్దె భవనంలో నడుస్తున్న అర్బన్ హెల్త్ సెంటర్ కొద్ది రోజుల్లోనే నూతన భవనంలోకి మారనుంది. కొత్త భవనంలో సేవలు మొదలయ్యాక జగనన్న కాలనీ, వైఎస్సార్‌నగర్, లింగంపల్లి, ఎంవీ నగర్, నెహ్రూ నగర్ ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయి. అత్యాధునిక పరికరాలతో రక్త పరీక్షలు నిర్వహించి వ్యాధి నిర్ధారణ తర్వాత అవసరమైన చికిత్స అందిస్తున్నాం.
>
> – ఈ. తేజశ్రీ, వైద్యాధికారి, నెహ్రూనగర్ అర్బన్ హెల్త్ సెంటర్

దివ్యాంగురాలికి వీల్ చైర్ అందజేత

ఉండ్రాజవరం: మండలంలోని కె.సావరానికి చెందిన దివ్యాంగురాలు గణపతిరాజు పద్మకు బుధవారం తణుకు సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ద్వారా వీల్ చైర్ అందజేశారు. సుమారు రూ.8 వేల విలువైన ఈ వీల్ చైర్‌ను అసోసియేషన్ సభ్యురాలు వడ్లమాని పార్వతి ఆర్థిక సహకారంతో అందజేసినట్టు సభ్యులు తెలిపారు. అలాగే అత్యవసర కంటి వైద్యం అవసరమైన పసలపూడికి చెందిన కాకర్ల లక్ష్మి ఇంటికి వెళ్లి ఉచితంగా వైద్యసేవలు అందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు డాక్టర్ హుస్సేన్ అహ్మద్, అధ్యక్షుడు అల్లూరి కరుణాకర్ చౌదరి, కోశాధికారి అర్జి భాస్కరరావు, వై.అప్పారావు పాల్గొన్నారు.

సమగ్ర భూ సర్వేకు సహకరించాలి

చాగల్లు: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూరక్ష పథకంలో భాగంగా మండల సర్వే బృందం దారవరం, బ్రాహ్మణగూడెం గ్రామాల్లోని రైతుల భూములను తనిఖీ చేస్తోందని డిప్యూటీ తహసీల్దార్ కె.ఆనంద్ కుమార్ బుధవారం తెలిపారు. రెవెన్యూ రికార్డుల నవీకరణ కోసం చేస్తున్న ఈ క్షేత్రస్థాయి సర్వేకు తమ భూముల హద్దులను సర్వే బృందానికి చూపించి రైతులు సహకరించాలని ఆయన కోరారు. రైతుల భూముల దస్తావేజులు, పాస్ పుస్తకంతో పాటు సంబంధిత ధ్రువపత్రాల జిరాక్స్‌లను సర్వే బృందానికి ఆయా గ్రామాల్లో అందజేసి భూ సర్వే సహకరించాలని కోరారు.

ప్రతి పథకం చరిత్రలో నిలిచిపోతుంది

- ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- తాడిమళ్ల, కానూరు అగ్రహారం గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం



తాడిమళ్లలో మహిళలకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు



కానూరు అగ్రహారంలో వృద్ధురాలికి సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

నిడదవోలు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి పథకం చరిత్రలో నిలిచిపోతుందని ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడు అన్నారు. మండలంలోని తాడిమళ్ల గ్రామంలో బుధవారం ఐదో రోజు ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, సర్పంచ్ బయ్యే రాధారాణి, వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు కటికిరెడ్డి నారాయణ రావు, పార్టీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు మానుకొండ చంద్రబాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు మాట్లాడుతూ టీడీపీ–జనసేనలది అట్టర్ ఫ్లాప్ కాంబినేషన్ అని ఎద్దేవా చేశారు. తాడిమళ్లను అభివృద్ధి చిరునామాగా మార్చామని చెప్పారు. భవిష్యత్తులో మరింతగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. పలువురి వినతులు తెలుసుకుని వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎంపీటీసీ సభ్యుడు కొప్పుల నాగేశ్వరరావు, ఉప సర్పంచ్ పెనుగొండ కృష్ణమోహన్, సొసైటీ అధ్యక్షుడు చింతల సీతారామయ్య, పార్టీ నాయకులు కాగిత లక్ష్మయ్య, కాగిత సత్తిపండు, తిరుమళ్ల దుర్గారావు, కొప్పుల రామదేవుడు పాల్గొన్నారు.

పెరవలి: గత పాలకులు నిడదవోలు నియోజకవర్గాన్ని నిర్లక్ష్యం చేస్తే, గత నాలుగున్నరేళ్లలో తాము రూ.2 వేల కోట్లతో అభివృద్ధి చేశామని ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడు అన్నారు. మండలంలోని కానూరు అగ్రహారంలో బుధవారం ఉదయం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏది చేసినా రాజకీయం చేసేందుకు ప్రయత్నిస్తున్న ఈ గ్రామ టీడీపీ, జనసేన నాయకులు నమ్మ వద్దన్నారు. అనేక అభివృద్ధి పనులు, వివిధ సంక్షేమ పథకాల ద్వారా ఈ గ్రామ ప్రజలకు రూ.35 కోట్ల మేర జగన్ ప్రభుత్వం లబ్ధి చేకూర్చిందన్నారు. ఇటువంటి సంక్షేమ ప్రభుత్వానికి ప్రజలందరూ అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు వీరమళ్ళ సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు కొమ్మిశెట్టి రామాంజని, గ్రామ సర్పంచ్ దాసం వెంకన్న, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పొట్టి రాంబాబు, పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు దాసం బాపన్న, పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

చెరువు పాటదారుడు, రైతుల మధ్య ముంపు వివాదం



అనికేశరం చెరువు గట్టును పరిశీలిస్తున్న తహసీల్దార్ కిశోర్‌కుమార్, ఇరిగేషన్ ఏఈ భాస్కరరావు

నల్లజర్ల: తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు చెరువులు, కాలువలు పొంగి ప్రవహించాయి. ఈ పరిస్థితి మండలంలోని అవపాడు పంచాయతీ పరిధిలోని అనికేశరం చెరువు పాటదారునికి, ఆ గ్రామ రైతులకు మధ్య వివాదానికి కారణమైంది. ఆ వివరాలిలాఉన్నాయి. అవపాడు పంచాయతీ ద్వారా ఓ వ్యక్తి అనికేశరం చెరువును లీజుకు పాడుకుని చేపలు పెంచుతున్నాడు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఈ చెరువు, దానికి ఎగువన ఉన్న వరి పంటలు నీట మునిగాయి. తమ పొలాలు నీట మునిగి ఉన్నందున దిగువ ప్రాంతంలో తూరలు పెట్టి వరద నీటిని రైతులు దిగువకు వదిలి పెడుతున్నారు. అయినప్పటికీ వారి పొలాలు ముంపులోనే ఉన్నాయి. అందుకు కారణం అనికేశరం చెరువు నుంచి నీటితో దిగువకు విడుదల చేయకపోవడమే. చెరువు నుంచి నీటిని దిగువకు విడుదల చేస్తే చేపలు కూడా కొట్టుకుపోయే ప్రమాదం ఉంది. అందుకే చెరువు పాటదారుడు అందుకు అంగీకరించడం లేదు. చెరువు పాటదారుని కారణంగా తమ పంటలు ముంపు నుంచి తేరుకోవడం లేదంటూ రైతులు ఇటీవల స్పందనలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ కిశోర్‌కుమార్, ఇరిగేషన్ ఏఈ భాస్కరరావు, వీఆర్వో వరలక్ష్మి బుధవారం ముంపు ప్రాంతాన్ని పరిశీలించారు. చెరువు పాటదారునితో మాట్లాడారు. ఎగువ రైతుల పొలాలు మునిగి పోకుండా అదనపు నీటిని కిందకు విడిచిపెట్టేలా అవపాడు సర్పంచ్ అచ్యుత సత్యనారాయణతో కూడా అధికారులు మాట్లాడారు. చేపలు కొట్టుకుపోకుండా తూరలు, ఐరన్ మెష్ ఏర్పాటు చేసుకోవాలని పాటదారునికి సూచించారు. అందుకు పాటదారుడు సమ్మతించడంతో వివాదం సద్దు మణిగింది.

పెట్రోల్ బంకు ఏర్పాటుకు స్థల పరిశీలన



దేవరపల్లిలో విలేకరులతో మాట్లాడుతున్న కొవ్వూరు ఆర్డీఓ కృష్ణనాయక్

దేవరపల్లి: ప్రభుత్వాదాయం పెంచడానికి రెవెన్యూ అసోసియేషన్ ఆధ్వర్యంలో పెట్రోలు బంకులు ఏర్పాటు చేస్తున్నట్టు కొవ్వూరు ఆర్డీఓ ఆర్.కృష్ణనాయక్ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పెట్రోల్ బంక్ ఏర్పాటుకు దేవరపల్లి–గోపాలపురం హైవేపై అచ్చయపాలెం వద్ద గల స్థలాన్ని పరిశీలించినట్టు తెలిపారు. కలెక్టర్ కె.మాధవీలత, జేసీ ఆదేశాల మేరకు పెట్రోలు బంకుల ఏర్పాటుకు స్థలాలను సేకరిస్తున్నట్టు చెప్పారు. ఖమ్మం–దేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ హైవేలో కూడా పెట్రోలు బంకు ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నట్టు ఆర్డీవో చెప్పారు.

బాధితులకు రూ.9.5 లక్షల సాయం

తుపాను వల్ల కొవ్వూరు డివిజన్‌లో 95 గృహాలు పాక్షికంగా దెబ్బతినగా ఒక్కో కుటుంబానికి రూ.10 వేల చొప్పున రూ.9.50 లక్షల ఆర్థిక సాయం అందజేసినట్టు ఆర్డీవో తెలిపారు. అలాగే 550 కుటుంబాలకు నిత్యావసరాలు అందజేశామన్నారు. వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారుల నుంచి వారం రోజుల్లో పంట నష్టం అంచనాల నివేదికలు వస్తాయని చెప్పారు. ఆ ప్రకారం నష్టపోయిన రైతులకు ఆర్థిక సాయం అందజేస్తామని తెలిపారు. నల్లజర్ల, తాళ్లపూడి మండలాల్లో ఎక్కువగా గృహాలు దెబ్బతిన్నాయన్నారు.

1,700 మందికి రెండు చోట్ల ఓట్లు

ఓటర్ల సర్వే పూర్తయిందని, కొవ్వూరు నియోజకవర్గంలో 1700 మందికి రెండు చోట్ల ఓటు హక్కు ఉన్నట్టు గుర్తించినట్టు ఆర్డీవో కృష్ణనాయక్ చెప్పారు. ఒక వ్యక్తికి ఒకచోట మాత్రమే ఓటు ఉండాలని స్పష్టం చేశారు. జిల్లాలో 36 వేల మంది యువత కొత్తగా ఓటు హక్కు నమోదు చేసుకున్నట్టు చెప్పారు. 90 రోజుల పథకంలో ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులకు త్వరలోనే పట్టాలు పంపిణీ చేస్తామన్నారు. ఇప్పటికే స్థల సేకరణ పూర్తి చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.రామకృష్ణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వరసగా క్యూ కట్టి.. ఆరు లారీలు ఢీకొట్టి



గోపాలపురం నుంచి కొయ్యలగూడెం రోడ్డులో ఆగి ఉన్న లారీని ఢీకొని నుజ్జు నుజ్జయిన లారీలు

గోపాలపురం: వరుసగా క్యూ కట్టి.. ఆరు లారీలు ఢీకొట్టాయి. స్థానిక కొయ్యలగూడెం రోడ్డులోని ఓ వేయింగ్ మెషీన్ వద్ద బుధవారం తెల్లవారుజామున చోటుచేసుకున్న ఈ ఘటన యాక్షన్ సినిమాలోని సన్నివేశాన్ని గుర్తుకు తెస్తోంది. స్థానిక ఎస్సై కె.సతీష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం ఈ వేయింగ్ మెషీన్ వద్ద ఓ లారీ ఆగి ఉంది. తొలుత హైదరాబాదు నుంచి రాజమహేంద్రవరం వైపు వెళుతున్న ఓ లారీ ఇక్కడ ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీ కొట్టింది. అక్కడితో అయిపోలేదు. అదే రీతిలో హైదరాబాద్ వైపు నుంచే వస్తున్న మరో ఐదు లారీలు ఒకదానివెనుక మరొకటిగా ముందు ఉన్న లారీలను ఢీ కొట్టాయి. కొన్ని క్షణాల వ్యవధిలో జరిగిన ఈ గొలుసుకట్టు ప్రమాదాల్లో ఢీకొట్టిన ఆరు లారీల ముందు భాగాలు దెబ్బతిన్నాయి. ఎత్తుగా ఉన్న ప్రాంతం నుంచి ప్రమాదం జరిగిన పల్లపు ప్రాంతంలోకి వచ్చేటపుడు లారీ డ్రైవర్ల అప్రమత్తంగా లేకపోవడం, వారు నిద్ర మత్తులో ఉండడం ఈ గొలుసుకట్టు ప్రమాదాలకు కారణమని ఎస్ఐ సతీష్‌కుమార్ తెలిపారు. ప్రమాదం జరిగిన సమయంలో మంచు కూడా పడుతోంది. ఒకలారీ అదుపు తప్పి రోడ్డు మార్జిన్‌లోకి దూసుకుపోయింది. ఈ ఘటనలో ఇద్దరు డ్రైవర్లు, ఇద్దరు క్లీనర్లు స్వల్ప గాయాలతో ప్రమాదం నుంచి బయట పడ్డారు. దెబ్బతిన్న మొత్తం ఏడు లారీలను పరిశీలిస్తే ఘోర ప్రమాదం జరిగిందా? అనేలా ప్రమాదం స్థలం ఉంది. ప్రమాదానికి గురైన లారీలను జేసీబీ సాయంతో తప్పించి వాహనాలకు రాకపోకలకు అంతరాయం లేకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు.

బీమా తక్షణ సాయం రూ.10 వేలు అందజేత

తాళ్లపూడి: మండలంలోని పెద్దేవం పంచాయతీ శివారు వార్డు చిడిపిలో పూలపల్లి వీర్రాజు అనే వ్యక్తి ఇటీవల మృతి చెందాడు. మట్టి ఖర్చుల నిమిత్తం ఆయన కుటుంబానికి ప్రభుత్వం నుంచి వైఎస్సార్ బీమా తక్షణ సాయంగా రూ.10 వేలు మంజూరైంది. ఈ మొత్తాన్ని సర్పంచ్ తిగిరిపల్లి వెంకట్రావు, ఉప సర్పంచ్ తోట రామకృష్ణ చేతులు మీదుగా బుధవారం మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. ప్రభుత్వం ద్వారా మిగిలిన రూ.90 వేలు కూడా నెల లోగా అందేలా చూస్తామని వారు హామీ ఇచ్చారు.

పేకాడుతున్న 15 మంది అరెస్టు

పెరవలి: మండలంలోని ఖండవల్లి గ్రామంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై మంగళవారం రాత్రి పెరవలి పోలీసులు దాడి చేశారు. ఇక్కడ పేకాడుతున్న 15 మందిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.35,060 నగదు స్వాధీనం చేసుకున్నట్టు పెరవలి ఎస్ఐ సూర్య భగవాన్ బుధవారం తెలిపారు. అరెస్టు చేసిన వారిని బుధవారం కోర్టులో హాజరు పరిచామన్నారు.

వినియోగంలో లేని మరుగుదొడ్లు


- 150 విద్యార్థులకు తప్పని అవస్థలు
- డీవైఈవో తనిఖీలో వెల్లడైన ప్రైవేట్ స్కూల్ నిర్వాకం



పాఠశాలలోని మరుగుదొడ్లను పరిశీలిస్తున్న డీవైఈవో రవీంద్రభారతి

నిడదవోలు: కనీస వసతులు లేకపోవడంతో పట్టణంలోని రవీంద్రభారతి ఇంగ్లిష్ మీడియం ప్రైవేట్ పాఠశాల విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. తాడేపల్లిగూడెం డిప్యూటీ ఎడ్యుకేషనల్ అధికారి (డీవైఈవో) ఎం.రవీంద్రభారతి బుధవారం ఈ పాఠశాలను సందర్శించినపుడు ఈ విషయం తెలుగులోకి వచ్చింది. సుమారు 150 మంది విద్యార్థులున్న ఈ పాఠశాలలో నీళ్ల లేక సుమారు రెండు వారాలుగా మరుగుదొడ్లు వినియోగంలో లేవు. వాటి నుంచి దుర్వాసన వస్తోంది. ఈ సమస్యను స్వయంగా విద్యార్థినులు డీవైఈవో దృష్టికి తీసుకువచ్చారు. ఇక్కడి టెన్త్ విద్యార్థులకు ఉదయం 7 నుంచి రాత్రి 7 గంటల వరకూ తరగతులు నిర్వహిస్తున్నారు. కనీస సదుపాయలు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఉదయం 8.30 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ మాత్రమే టెన్త్ విద్యార్థులను తరగతులు నిర్వహించాలని డీవైఈవో రవీంద్రభారతి నిర్వాహకులను ఆదేశించారు. ఈ స్కూల్‌పై జిల్లా ఉన్నతాధికారులకు నివేదించి తగు చర్యలు చేపడతామని డీవైఈవో చెప్పారు. ఎంఈవోలు గురుస్వామి, గణేష్ పాల్గొన్నారు.

సందడిగా వై ఏపీ నీడ్స్ జగన్



నిడదవోలు మండలం డి.ముప్పవరంలో సమాచార బోర్డును ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు



పెరవలిలో సమాచార పట్టికను ప్రారంభిస్తున్న ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ తదితరులు



నల్లజర్ల మండలం పడమర చోడవరంలో డిస్ ప్లే ఆవిష్కరణ

నిడదవోలు రూరల్: మండలంలోని డి.ముప్పవరంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఆ గ్రామ పరిధిలో రూ.17.50 కోట్ల సంక్షేమ పథకాలు, రూ.13.18 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలతో కూడిన సమాచార బోర్డులను వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, జేసీఎస్ మండల కన్వీనర్ వెలగన పోలయ్య, సర్పంచ్ నాగిరెడ్డి నాగదేవి ఆవిష్కరించారు. అనంతరం పార్టీ జెండాను పల్లారావు ఎగుర వేసి సంక్షేమ పథకాలపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. సీనియర్ ఓటర్లతో సమావేశం నిర్వహించారు. పార్టీ శ్రేణులంతా కలిసి సహపంక్తి భోజనం చేసి పల్లె నిద్ర చేశారు. ఎంపీటీసీ సభ్యుడు సంగినీడి సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు నాగిరెడ్డి సత్తిపండు, మానెం అజయ్, పసుపులేటి చిట్టియ్య, మద్దాల ప్రభు, ముప్పిడి విజయ్, ఈఓపీఆర్డీ రత్నమాలిక తదితరులు పాల్గొన్నారు.

పెరవలి: పెరవలి-1 సచివాలయం పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ మాట్లాడుతూ ఈ సచివాలయ పరిధిలో ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం గత నాలుగున్నరేళ్లలో రూ.19.36 కోట్లు ఖర్చు చేసిందన్నారు. ఆ వివరాలు వెల్లడించే సమాచార పట్టికను గ్రామ సచివాలయం వద్ద ఎంపీపీ ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలసి గ్రామంలో పర్యటించి రాష్ట్రానికి జగన్ ఎందుకు అవసరమో ప్రజలకు వివరించారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు వీరమళ్ల సత్యనారాయణ, జేసీఎస్ మండల కన్వీనర్ రామగుడుల సూర్యనారాయణ, పార్టీ ఎస్సీ సెల్ జిల్లా, మండల శాఖల అధ్యక్షులు పొట్టి రాంబాబు, బీరా రాజు, సర్పంచ్ గంగోలు సీతమ్మ, సొసైటీ అధ్యక్షులు నాగిరెడ్డి నాగేశ్వరరావు, ఆగర్తి కృష్ణారావు పాల్గొన్నారు.

నల్లజర్ల: మండలంలోని పడమర చోడవరంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ గ్రామ నాయకులు భోగవల్లి శ్రీరామారావు, గన్నమని సుబ్బారావు అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. గ్రామంలో రూ.12.21 కోట్లతో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించే సమాచార పట్టికను వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గగ్గర శ్రీనివాసరావు గ్రామ సచివాలయం వద్ద ఆవిష్కరించారు. పార్టీ జెండాను శ్రీరామారావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో జేసీఎస్ జిల్లా కన్వీనర్ కారుమంచి రమేష్, జేసీఎస్ మండల కన్వీనర్ కఠారి రాజ్‌కుమార్, పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు కసుకుర్తి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

గోపాలపురం: మండలంలోని వేళ్లచింతలగూడెం సచివాలయం వద్ద వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ సమాచార డిస్‌ప్లే బోర్డును సచివాలయం వద్ద ఆవిష్కరించారు. గ్రామ కూడలిలో వైఎస్సార్‌సీపీ పతాకాన్ని ఎగురవేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత, పార్టీ మండల కన్వీనర్ పోతిరెడ్డి నాగరాజు, సర్పంచ్ గొల్ల కుమార్, ఉప సర్పంచ్ తానింకి సత్యనారాయణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.